సాక్షి
కుమురం భీం

శనివారం । 18 । మార్చి । 2023



పంచాయతీల నిర్వహణ ఎలా?
పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ఆరు నెలలుగా విడుదల చేయడంలేదు. సర్పంచులకు పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. IIలో▸



సామూహిక వివాహాలు
కౌటాల మండలం తలోడి సమీపంలోని భీమన్న దేవస్థానంలో సామూహిక వివాహాలు జరిపించారు. ఏడు ఆదివాసీ జంటలు పెళ్లితో ఏకమయ్యాయి. IIలో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.3 /19.3
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీజేపీ సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఆసిఫాబాద్‌: టీచర్స్‌ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్‌ రెడ్డి విజయం సాధించడంతో శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌక్‌ వద్ద ఆ పార్టీ నాయకులు విజయోత్సవ సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్‌, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్‌, మండల అధ్యక్షుడు వినోద్‌, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నిఖిల్‌, అవినాశ్‌, కుమార్‌, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఉపేందర్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్‌ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్‌ డిమాండ్‌ చేశారు. మండలంలోని నంబాలలో శుక్రవారం పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్‌ విధానాన్ని వెంటనే రద్దు చేసి, జీవో 11 లేదా 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. అర్హత కలిగిన కారోబార్లను పంచాయతీ కార్యదర్శులుగా నియమించి రూ.26వేల వేతనం చెల్లించాలని కోరారు. కొన్ని పంచాయతీల్లో కార్మికులకు నాలుగైదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 51 రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. పీఆర్సీ ప్రకారం 30 శాతం వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు శంకర్‌, కార్యదర్శి వెంకటేశం, నాయకులు పోశం, శ్రీనివాస్‌, సుబ్బయ్య, స్వామి పాల్గొన్నారు.

‘అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు’



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్‌: ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్‌ చేయడం సిగ్గుచేటని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తప్పిదాలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్‌, శ్రీనివాస్‌, షాకీర్‌, రాజేశ్‌, ప్రశాంత్‌, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ వీఓఏల సమ్మె



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఎదుట ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. సమ్మెలో భాగంగా రెండో రోజు అన్ని మండల కేంద్రాల్లో వీఓఏల నిరసన కార్యక్రమాలు కొనసాగాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్‌ తెలిపారు. శనివారం నిర్వహించే చలో కలెక్టరేట్‌ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని వీఓఏలు జిల్లా కేంద్రానికి తరలిరావాలని కోరారు. నాయకులు రమాదేవి, సుదర్శన్‌, షైమా, శ్రీలత, జ్యోతి, కవిత, శ్రీలక్ష్మి, పద్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌ వాష్‌కు అర కిలోమీటర్‌!





వేసవి ప్రారంభంలోనే జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులైతే హ్యాండ్‌ వాష్‌కు కూడా అష్టకష్టాలు పడుతున్నారు. చింతలమానెపల్లి మండలం డబ్బా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో 150 మంది, ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి భగీరథ నీరందకపోవడంతో కొద్దిరోజులుగా పాఠశాల ఎదుట ఉన్న చేతిపంపు నీటినే వాడుకుంటున్నారు. అయితే పది రోజుల క్రితం ఆ చేతిపంపు చెడిపోయింది. దీంతో బడి నుంచి అరకిలోమీటర్‌ దూరంలోని మరో చేతిపంపు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. మధ్యాహ్నం తర్వాత విద్యార్థులు తాగునీటికి, ప్లేట్లు కడుక్కోవాలంటే చేతిపంపు వద్దకు నడవాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు సైతం అక్కడి నుంచే నీటిని మోసుకొస్తున్నారు. ఇక మరుగుదొడ్లయితే నీళ్లులేక కంపు కొడుతున్నాయి. - చింతలమానెపల్లి

పల్లె ప్రగతిపై నజర్‌



కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా గ్రామం

- ప్రతినెలా 1, 3వ శనివారం సమీక్షా సమావేశాలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్యలపై చర్చ
- మండల స్థాయిలో పరిష్కారం చూపేలా చర్యలు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్‌
- అన్ని మండల కేంద్రాల్లో నేటి నుంచి ప్రారంభం

కెరమెరి(ఆసిఫాబాద్‌): జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువ. భిన్న సంస్కృతులకు నిలయంగా నిలిచే కుమురంభీం జిల్లాలో సమస్యలూ అధికమే. వేసవిలో మారుమూల ప్రాంతాల్లో తాగునీటి అవస్థలు ఇక్కడ నిత్యకృత్యం. ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌కు వివిధ గ్రామాల నుంచి ప్రజలు సమస్యలు పరిష్కరించాలని క్యూ కడుతుంటారు. మండల స్థాయి సమస్యలు కూడా స్థానికంగా పరిష్కారం కాకపోవడంతో బాధితులు నేరుగా కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించేందుకు కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయ పరిచి నిత్యం అన్ని మండలాల కేంద్రాల్లో అభివృద్ధి ప్రగతి సమీక్షా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాల్లో స్థానిక సమస్యలను చర్చించి అక్కడే పరిష్కార మార్గాలు కనుగొనేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నారు. ప్రతినెలా మొదటి, మూడో శనివారం ఈ సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు.

15 మండలాలు.. 335 పంచాయతీలు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీగా కొనసాగుతుండగా, జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌ చేసేందుకు ఇటీవల ముందడుగు పడింది. గ్రామాల అభివృద్ధిపై చర్చించేందుకు ఇక నుంచి ప్రతీ నెలలో మొదటి, మూడో శనివారం మండలంలోని అన్ని శాఖల అధికారులతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. నేటి నుంచి జిల్లాలోని 15 మండల పరిషత్‌ కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాలు నిర్వహించాలని ఎంపీడీవోలకు కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. ఎంపీవో, ఎంఈవో, ఇంజనీర్లు, సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు, పీఆర్‌, ఐటీడీఏ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, మండల వ్యవసాయాధికారి, ఈజీఎస్‌, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది.

మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

మండల స్థాయిలో అన్ని శాఖలకు చెందిన అధికారులు ఉంటారు. అయినా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగానికి భారీగా అర్జీలు వస్తున్నాయి. ఇందులో అధికంగా మండల స్థాయిలోనే పరిష్కరించవచ్చని ఉన్నతాధికారులు గుర్తించారు. సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వ్యయప్రయాసాలకు ఓర్చి జిల్లా కేంద్రానికి తరలివస్తున్నారు. గ్రామాల్లో సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా సమావేశాల్లో నిర్ణయాలు తీసుకుంటారు.

మరింత పర్యవేక్షణ

పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పల్లె ప్రకృతి వనాలు, బృహత్‌ ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్‌ యార్డులు, సెగ్రిగేషన్‌ షెడ్లు, రైతువేదికలను ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. అలాగే భగీరథ నీటి సరఫరాపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. అనేక చోట్ల ట్యాంకులకు ఇప్పటివరకు కనెక్షన్లు ఇవ్వలేదు. సమావేశాల్లో ఇలాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. మండలంలో ఏఏ పంటలు పండుతున్నాయి..? రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారా? మహిళా సంఘాల ప్రగతి, మన ఊరు– మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు ఎలా కొనసాగుతున్నాయి..? అభివృద్ధి పనులు ఎలా కొనసాగుతున్నాయి..? తదితర అంశాల గురించి చర్చించనున్నారు. ప్రతీ అంశంపై చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్‌ తీసుకున్న ఈ నిర్ణయంతో అభివృద్ధి పనులపై మరింత పర్యవేక్షణ పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారుల్లో ఆశలు

- రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌
- ఏప్రిల్‌ మొదటి వారం నుంచి అందించేలా చర్యలు
- జిల్లాలో 1,502 మంది లబ్ధిదారులు



వాంకిడి(ఆసిఫాబాద్‌): రాష్ట్ర ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, లబ్ధిదారులకు 75 శాతం సబ్సిడీతో యూనిట్లు రెండు విడతలుగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. 2017లో మొదటి విడత గొర్రెలను పంపిణీ చేయగా.. మళ్లీ ఐదేళ్ల తర్వాత రెండో విడతకు గ్రీన్‌ సిగ్నల్‌ వచ్చింది. ఈ నెల 9న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జిల్లాలో అధికారులు కసరత్తు ప్రారంభించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

టార్గెట్‌ 4,405 యూనిట్లు

జిల్లాలోని 15 మండలాలకు చెందిన గొల్లకురుమల్లో 2017లోనే మొదటి, రెండో విడత లబ్ధిదారులను ఒకేసారి ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,405 మంది లబ్ధిదారులను గుర్తించారు. తొలి విడతలో 2,903 మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతకు ఎంపికైన 1,502 మంది లబ్ధిదారులు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల మంత్రుల మీటింగ్‌లో గొర్రెల యూనిట్ల పంపిణీకి గ్రీన్‌ సిగ్నల్‌ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్‌ మొదటి వారంలో యూనిట్ల పంపిణీ ప్రారంభించి ఆగస్టులోగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

75 శాతం రాయితీ..

గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక యూనిట్‌లో 20 గొర్రెలతోపాటు ఒక పొట్టేలును అందిస్తోంది. లబ్ధిదారులకు 75 శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తోంది. మొదటి విడత గొర్రెల పంపిణీలో యూనిట్‌ విలువ రూ.1,25000 ఉండగా 75 శాతం సబ్సిడీ రూ.93,750లను ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగిలిన 25 శాతం లబ్ధిదారు వాటగా రూ.31,250 డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రెండో విడత గొర్రెల పంపిణీలో యూనిట్‌ విలువతోపాటు రాయితీని కూడా పెంచారు. యూనిట్‌ విలువ రూ.1.75 లక్షలు ఉండగా, లబ్ధిదారు వాటా కింద 25 శాతం రూ.43,750లను డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. 75 శాతం రాయితీ రూ.1,31,250 ప్రభుత్వమే భరించనుంది. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు రాగనే పంపిణీ పనులు వేగవంతం చేస్తామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

లబ్ధిదారులకు ఎదురుచూపులు..

గొర్రెల పంపిణీ పథకానికి మొత్తం 4,405 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. తొలి విడతలో 2,903 మందికి అందించారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు రాకపోవడంతో రెండో విడతలో డీడీలు చెల్లించేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఫలితంగా రెండో విడతలో 1,502 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు కేవలం 300 మంది మాత్రమే డీడీలు చెల్లించారు. మరో 1,302 మంది డీడీలు చెల్లించాల్సి ఉంది. డీడీలు చెల్లించిన వారికి ఐదు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.

ఆదేశాలు రాగానే పంపిణీ



రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. తొలి విడతలో 2,903 మంది లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేశాం. రెండో విడతలో 1,502 మందిని ఎంపిక చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తాం.
– సురేశ్‌కుమార్‌, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

స్పీడ్‌ పోస్టు ద్వారా కల్యాణ తలంబ్రాలు

కాగజ్‌నగర్‌రూరల్‌: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీసీతారామ దేవస్థానంలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే స్పీడ్‌పోస్టు ద్వారా అందించడానికి తపాలాశాఖ సన్నాహాలు చేసిందని కాగజ్‌నగర్‌ పోస్టల్‌శాఖ సబ్‌ డివిజనల్‌ ఇన్‌స్పెక్టర్‌ సిరికొండ సతీశ్‌ తెలిపారు. మంత్రాలయ అర్చన, కల్యాణ తలంబ్రాలకు రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150గా ధర నిర్ణయించామని పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఇంటర్‌ పరీక్షలు

- మూడో రోజు 5,005 మంది విద్యార్థుల హాజరు



జిల్లా కేంద్రంలోని పరీక్ష తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ రాజేశం

ఆసిఫాబాద్‌: జిల్లాలో ఇంటర్మీడియెట్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్‌–1 పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5,349 మంది విద్యార్థులకు గాను 5,005 మంది హాజరయ్యారు. 344 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌ తెలిపారు. జనరల్‌ విద్యార్థుల్లో 4,548 మంది విద్యార్థులకు 4,311 మంది, ఒకేషనల్‌లో 801 మంది విద్యార్థులకు 694 మంది హాజరయ్యారు. కాగజ్‌నగర్‌ పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్‌ రాజేశం తనిఖీ చేయగా, జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌ పరిశీలించారు. అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 20 కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు కల్పించినట్లు తెలిపారు. మాస్‌కాపీయింగ్‌ లేకుండా డీఈసీ బృందం, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ సభ్యులు, సిట్టింగ్‌ స్క్వాడ్‌ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. సమాధాన పత్రాలను సకాలంలో పోస్టాఫీసుల ద్వారా పంపించాలని సూచించారు.

మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలి

- ఎంఐఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్‌: రంజాన్‌ మాసం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంఐఎం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 23న రంజాన్‌ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేయాలని, నమాజ్‌ సమయంలో వాహనాల తనిఖీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిరోజూ తాగునీటి సరఫరా చేయాలన్నారు. రాత్రివేళలో షాపింగ్‌ కాంప్లెక్సులు, హోటళ్లు తెరిచి ఉండేలా చూడాలని కోరారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాస్‌, సీఐ రాణాప్రతాప్‌కు సైతం వినతిపత్రాలు అందించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్‌, ప్రధాన కార్యదర్శి మీర్‌ కాశీఫ్‌ అలీ హష్మీ, అజీమొద్దీన్‌ అలీ, అఫ్రోజ్‌ ఉన్నారు.

గుండి వంతెన పూర్తి చేయాలి

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే
- నిర్మాణ స్థలం పరిశీలన



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

ఆసిఫాబాద్‌: మండలంలోని గుండి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ గతేడాది వర్షాలతో పిల్లర్‌ పైనుంచి వరద వెళ్లడంతో కొంతమేర దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో వంతెన నిర్మాణాన్ని రీడిజైన్‌ చేసి టెండర్‌ ప్రక్రియ నిర్వహించి గుత్తేదారులకు పనులు అప్పగించామని పేర్కొన్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్‌, వాంకిడి మండలాలను కలుపుతూ ప్రజలకు ప్రయాణ భారాన్ని సులభతరం చేసేందుకు వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జూన్‌ 15లోగా పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్‌ ఈఈ రామ్మోహన్‌ రావు, ఏఎంసీ చైర్మన్‌ గాదెవేణి మల్లేశ్‌, గ్రామస్తులు ఉన్నారు.

ఫీజుల కోసం వేధిస్తే చర్యలు

- జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్‌

సాక్షి స్పందన



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీసీపీవో మహేశ్‌

చింతలమానెపల్లి(సిర్పూర్‌): ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్‌ హెచ్చరించారు. ఈ నెల 16న బుధవారం ‘సాక్షి’లో ప్రచురితమైన ‘ఫీజు చెల్లించడం లేదని చితకబాదారు’ కథనానికి ఆయన స్పందించారు. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్‌ శ్రీనికేతన్‌ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థినులు శృతి, ప్రీతిలతో మాట్లాడారు. ఫీజు చెల్లించాలని ఒకసారి, హోంవర్క్‌ చేయలేదని మరోసారి ఉపాధ్యాయుడు తమను వాతలు వచ్చేలా కొట్టినట్లు వారు వివరించారు. విద్యార్థులను కొట్టడంపై ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌పై డీసీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల కోసం వేధిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, విద్యార్థులను దండించడం బాలల హక్కుల ఉల్లంఘనగా పరిగణించి జువైనల్‌ జస్టిస్‌ యాక్ట్‌– 2015 సెక్షన్‌ 82 ప్రకారం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పాఠశాల యాజమాన్యంతో వాంగ్మూలం రాయించారు. ఆయన వెంట చైల్డ్‌లైన్‌ ఇన్‌చార్జి ప్రవీణ్‌ కుమార్‌ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రాజకొమురయ్యకు క్రీడారత్న అవార్డు



అవార్డు తీసుకుంటున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, పట్టణానికి చెందిన సీనియర్ వెటరన్ క్రీడాకారుడు మడిపెల్లి రాజకొమురయ్య క్రీడా రత్న జాతీయ అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో గత ఆదివారం తిరుపతిలో ప్రజాగాయకుడు గద్దర్ చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి అకాడమీ వారు ఏటా జాతీయ అవార్డులు అందిస్తుండగా 60 ఏళ్ల వయస్సులో వెటరన్ పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్న రాజకొమురయ్యను ఈ సంవత్సరం అవార్డుకు ఎంపిక చేశారు.

ఏరియాలో పర్యటించిన ఐఐటీ శాస్త్రవేత్త



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాజిబ్ మైత్రి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖరగ్‌పూర్ ఐఐటీ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ రాజిబ్ మైత్రి సైంటిఫిక్ స్టడీలో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి ఏరియాలో ప్రతిపాదించిన గోలేటి ఓసీపీ ప్రాంతాలు, సోనాపూర్, నర్సాపూర్‌లోని నాలాలను పరిశీలించారు. నాలాల మళ్లింపుల మూలంగా సంభవించే ప్రమాదాలు, ప్రయోజనాలపై అధ్యయనం చేశారు. ప్రస్తుతం నాలాల పరిస్థితి, మళ్లింపు ప్రదేశాలు పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఎస్వోటూ జీఎం గుప్తా, ఆర్‌అండ్‌బీ అదనపు మేనేజర్ అమర్‌నాథ్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, బీపీఏ ఓసీపీ-2, గోలేటి మేనేజర్ మహేశ్ పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. శుక్రవారం గోలేటి సీహెచ్‌పీలో ఇన్‌చార్జి డీజీఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కొంతమంది కార్మికులను గోలేటి సీహెచ్‌పీకి డిప్యూటేషన్‌పై పంపించారని తెలిపారు. అయితే ముడుపులు అప్పజెప్పిన కొంతమందిని మాత్రం ఏరియా ఆస్పత్రిలో అవసరం లేకుండా ఉంచుకున్నారని పేర్కొన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం మానుకుని డిప్యూటేషన్‌పై పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. డిప్యూటేషన్ కాల పరిమితి ముగిసినవారికి మరోసారి డిప్యూటేషన్ కల్పిస్తామని కొందరు బ్రోకర్లు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి కార్మికులను నిలువునా దోచుకుంటున్నారని తెలిపారు. ఏరియాలో అనేక సర్ఫేస్ మజ్దూర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇక్కడ పని చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పిస్తూ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పిట్ కార్యదర్శి ఆరీఫ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ఉమామహేశ్వర్, ఏరియా ఆర్గనైజర్లు దత్తు, షిఫ్టు ఇన్‌చార్జి కిష్టస్వామి పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణ ఎలా?



తాళ్లపేట గ్రామపంచాయతీ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలు

జిల్లా	గ్రామపంచాయతీలు
మంచిర్యాల	310
నిర్మల్	396
ఆదిలాబాద్	468
కుమురంభీం	335

దండేపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లెప్రగతి పథకాన్ని నిధుల కొరత వేధిస్తోంది. నెలనెలా నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రతీ నెల ఎంపీడబ్ల్యూల వేతనాలు, కరెంట్ బిల్లులు, పంచాయతీ ట్రాక్టర్ల కిస్తుల చెల్లింపుతోపాటు ట్రాక్టర్ నిర్వహణకు కొంత మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్ఎఫ్‌సీ) ఆరు నెలలుగా విడుదల చేయడంలేదు. జనరల్ ఫండ్‌ను వినియోగించుకునేందుకు జారీ చేసిన చెక్కులు నెలల తరబడి పాస్‌కావడం లేదు. ఖాతాల్లో ఉన్న ఎస్ఎఫ్‌సీ నిధులు వినియోగించుకుందామంటే చెక్కులు జనరేట్ కావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణకు సర్పంచులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ఆర్నెళ్లుగా అందని నిధులు
- కుంటుపడుతున్న అభివృద్ధి
- ఇబ్బందుల్లో పాలకవర్గాలు

ఎస్ఎఫ్‌సీ నిధులతో కాలం వెల్లదీత

కొద్దిపాటిగా వస్తున్న 15వ ఆర్థిక సంఘం (ఎఫ్ఎఫ్‌సీ) నిధులతో పంచాయతీ పాలకవర్గాలు కాలం వెల్లదీస్తున్నాయి. నెలనెలా ఎస్ఎఫ్‌సీ నిధులు సక్రమంగా మంజూరు కావడంలేదు. ఉన్న నిధులు ఖర్చు చేద్దామంటే చెక్కులు జనరేట్ కాని పరిస్థితి ఉంది. జనరల్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులు కూడా పాస్ కావడంలేదు. కొన్ని చోట్ల మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల చెల్లింపుల్లో ఆలస్యమవుతోంది. పైగా పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ తలకు మించిన భారమవుతోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, పంచాయతీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ఎస్ఎఫ్‌సీ నిధులు నెలనెలా జమచేయాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందవుతోంది.



ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు నెలల తరబడి నిధులు మంజూరు చేయడంలేదు. దీంతో చాలా ఇబ్బందవుతోంది. ట్రాక్టర్ల నిర్వహణ, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపునకు చాలా కష్టమవుతోంది. పంచాయతీ నిర్వహణ భారమవుతోంది. నెలనెలా నిధులు విడుదల చేయాలి. ఉన్న నిధులు ఖర్చు చేసుకునేందుకు జారీ చేసిన చెక్కులు పాసయ్యేలా చూడాలి.

– అనవేని ప్రేమల, సర్పంచ్, నాగసముద్రం

ప్రభుత్వానికి వివరాలు పంపిస్తున్నాం

ఎస్ఎఫ్‌సీ, జీపీల జనరల్ ఫండ్ నిధులు ఖర్చు చేసుకునేందుకు ప్రభుత్వ ఆమోదం రానందున చెక్కులు పాస్‌కావడం లేదు. వివరాలు ప్రభుత్వానికి పంపిస్తున్నాం. చెక్కులు పాస్ కాకపోవడంతో చిన్నచిన్న పంచాయతీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఇబ్బందులు అధిగమిస్తున్నాం. త్వరలోనే సమస్య తీరిపోతుంది.

– వెంకటేశ్వర్‌రావు, డీపీవో, మంచిర్యాల

బాల్య వివాహం అడ్డగింత



కుటుంబసభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో బాల్య వివాహాన్ని శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందనే సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నా రు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు అమ్మాయిలు, 21 ఏళ్లలోపు అబ్బాయిలకు వివాహం చే యడం చట్టరీత్యా నేరమని డీసీపీవో తెలి పారు. బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు న్నాయని వివరించారు. తల్లిదండ్రుల నుంచి బాల్య వివాహం చేయబోమని లిఖిత పూర్వక హామీపత్రం రాయించారు. బాల్య వివాహా లకు కారకులైన వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్‌కుమార్, చైల్డ్‌లైన్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గాండ్ల శంకర్ తదితరులున్నారు.

ఒప్పందాలు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి



ఇందారం ఐకే1ఏ గనిపై మాట్లాడుతున్న రాజిరెడ్డి

జైపూర్: ఒప్పందాలు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి సూచించారు. మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై సీఐటీయూసీ బ్రాంచ్ అధ్యక్షుడు మీడువల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఒప్పందాలు పరిష్కరించి ఎన్నికలకు వెళ్తే కార్మికులు యూనియన్లను అభినందిస్తాయని తెలిపారు. రెండు ఓట్ల సిద్ధాంతంపై వివరణ ఇచ్చారు. ఏరియా స్థాయిలో ఒక ఓటు సింగరేణి స్థాయిలో పరిష్కారమయ్యేలా, మరో ఓటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2011లో చేసిన అలవెన్సులపై ఐటీ మాఫీ ఒప్పందాన్ని ఇప్పటివరకు గెలిచిన సంఘాలు అమలు చేయని సింగరేణి యాజమాన్యం అధికారులకు అమలు చేస్తూ కార్మికులకు ఆర్థిక నష్టం కలగజేస్తుంటే గెలిచిన సంఘాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. చివరికి ప్రతీ సంవత్సరం ఇచ్చే సీఎంపీఎఫ్ చిట్టీలు కూడా సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఎన్నికల పేరిట కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి కార్మికులు యూనియన్ల వారీగా విడిపోతుంటే కోవిడ్ పేరు చెప్పి ప్లేడేలు తగ్గించిందని తెలిపారు. ఉత్పత్తి నెలలో ఇచ్చే స్పెషల్ ఇన్సెంటివ్ కూడా ఎగవేసిందన్నారు. బ్రాంచ్ సెక్రటరీ గోదారి భాగ్యరాజ్, డివిజన్ ఆర్గనైజర్ చంద్రశేఖర్, నాయకులు శంకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

70 క్వింటాళ్ల పత్తి దగ్ధం

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లవాడలో శుక్రవారం మధ్యాహ్నం రైతు పెర్సింగుల పోషన్న ఇంటి వెనుక నిల్వ చేసిన 70 క్వింటాళ్ల పత్తి ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పోషన్న ఇంట్లోవాళ్లంతా సమీపంలో జరుగుతున్న వివాహ వేడుకలకు వెళ్లారు. కాగా, ఒక్కసారిగా వచ్చిన గాలికి మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని బిందెలతో నీటిని పోసి మంటలార్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకోగా కాలనీ రోడ్డు చిన్నది కావడంతో ప్రమాద స్థలం వరకు వెళ్లలేదు. ఈ ప్రమాదంలో సుమారు 25 క్వింటాళ్ల పత్తి, షెడ్డు కాలిపోగా రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది.

కౌటాలలో సామూహిక వివాహాలు

- ఒక్కటైన ఆదివాసీ నిరుపేద జంటలు
- వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



వధూవరులతో ఎమ్మెల్యే దంపతులు

కౌటాల: మండలంలోని తలోడి గ్రామసమీపంలోని భీమన్న దేవస్థానంలో బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వివాహాలు జరిపించారు. కార్యక్రమంలో ఏడు నిరుపేద ఆదివాసీ జంటలు ఏకమయ్యాయి. నిర్వాహకులు కొత్త జంటలకు పట్టు వస్త్రాలు, తాళిబొట్లు, మెట్టెలు అందించారు. సిర్పూర్(టీ) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు కొత్త జంటలకు పట్టు వస్త్రాలు, అలంకరణ సామగ్రి, వంట సామగ్రి అందజేసి ఆశీర్వదించారు. పెళ్లికి వచ్చిన మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, స్థానిక దాతల సహకారంతో సామూహిక వివాహాలు జరిపించాలని సూచించారు. తర్వాత వధూవరులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు సామూహిక వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, మన్నెవార్ కొలవార్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోశం, మన్నెవార్ కొలవార్ సంఘం వ్యవస్థాపకుడు సుంకే కిష్టయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు డబ్బా బాపు, సర్పంచులు సొల్ల శంకరమ్మ, వొజ్జల మౌనిశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్‌రావు, నాయకులు మధుకర్, తిరుపతి, రవీందర్‌గౌడ్, హన్మంతు, శ్రీనివాస్, రాంచందర్, సంతోష్, గోపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిని ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు సంస్థలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ సూచించారు. శుక్రవారం ఏరియాలోని గోలేటి, మాదారం సివిల్ కార్యాలయాలు, సీహెచ్‌పీలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రక్షణతో కూడిన పనులపై ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. రక్షణ ప్రతిజ్ఞ చేసిన అనంతరం భద్రత నియమాల కరపత్రాలు పంపిణీ చేశారు. గోలేటి సివిల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం నుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల భద్రత కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. సివిల్ పనులు చేసే సమయంలోనూ ఉద్యోగులు, కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఎస్వోటూజీఎం గుప్తా, డీజీఎం సివిల్ సతీశ్ బాబు, ఐఈడీ డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెరా, ఈఈ రాజేంద్రప్రసాద్, సూపర్‌వైజర్లు రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

పాతమంచిర్యాల: పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్న 1,156క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 18న ఉదయం 11గంటలకు కలెక్టర్ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) చాంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) డీ మధుసూదన్‌నాయక్ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షల డిపాజిట్ సొమ్మును 'జిల్లా పౌరసరఫరాల అధికారి' పేరిట డీడీ తీసి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం ముగిసిన అనంతరం డీడీ సొమ్ము తిరిగి చెల్లించబడుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పీడీఎస్ బియ్యం, చక్కెర, గోధుమల వ్యాపారం చేసేవారు, లేదా రైస్‌మిల్లర్లు గాని ఉండరాదని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత దక్కించుకున్న వారికి అదనపు కలెక్టర్ ఉత్తర్వులకు లోబడి ఉంటుందని వివరించారురు. అదనపు కలెక్టర్ అనుమతి జారీ చేసిన 24 గంటల్లోపు పాటకు సంబంధించిన పైకం చెల్లించి సరుకు స్వాధీనం చేసుకోవచ్చని సూచించారు. వేలం జరిగే ముందురోజు సరుకును పరిశీలించుకునేందుకు అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. బహిరంగ వేలం తుది నిర్ణయం వేలం నిర్వహించిన అధికారికి ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం బెల్లంపల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపర్చినట్లు తెలిపారు.

టాటా ఏస్ బోల్తా

- నలుగురు విద్యార్థులకు గాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న టాటాఏస్ వాహనం బోల్తా పడింది. ఈ వాహనంలో ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బీరెల్లి, ఆస్నాద గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ప్రతీరోజు వేర్వేరు వాహనాల్లో పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. శుక్రవారం రెండు గ్రామాల విద్యార్థులు ఒకే టాటా ఏస్ వాహనంలో పాఠశాలకు వెళ్లారు. పాఠశాల ముగిశాక బీరెల్లిలో విద్యార్థులను దింపి ఆస్నాదకు వస్తున్న క్రమంలో నాగాపూర్ ఏర చెరువు సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆస్నాద గ్రామానికి చెందిన మోరె శ్రేయస్, కొల్లూరి అచ్యుత్, కుంట అభినయశ్రీ, సుల్తానా అనే విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్తులు విద్యార్థులను తీసుకెళ్లి స్థానికంగా చికిత్స చేయించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులకు సమాచారం అందించారు.

ఆయిల్‌పామ్ సాగు ఆదర్శం



మొక్క పరిశీలిస్తున్న వెంకట్రాంరెడ్డి

పెంబి: మండల కేంద్రానికి చెందిన పాకల ఫౌండేషన్ చైర్మన్ పాకల రాంచందర్ ఆయిల్‌పామ్ సాగు చేయడం ఆదర్శనీయమని తెలంగాణ రాష్ట్ర మాజీ ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం రాంచందర్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలు పర్యవేక్షించి మాట్లాడారు. దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, దీనికి కారణం సీఎం కేసీఆర్ ప్రోత్సాహమేనన్నారు. మలేషియా, ఇండోనేషియా ఆఫ్రికా దేశాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేవారని, మారుమూల గ్రామంలో పెంబి మండలంలో ఇలా ఆయిల్‌పాం సాగు చేయడం పలువురి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పాకల రాంచందర్‌ను అభినందించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవతో పాక్‌పట్ల సమీపంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నెలకొల్పినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి సతీమణి రాగలత, రైతులు లింగారెడ్డి, భీముడు తదితరులున్నారు.

పలుకరిస్తూ.. గోడు వింటూ

- అండగా ఉంటామని 'భట్టి' భరోసా
- రెండోరోజు 'పీపుల్స్ మార్చ్'
- నేడు ఖానాపూర్ నియోజకవర్గంలోకి ప్రవేశం



చెప్పులు కుట్టే కార్మికుడితో భట్టి మాటామంతి

సాక్షి,ఆదిలాబాద్/ఇచ్చోడ/సిరికొండ: ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రజా సమస్యలను ఓపిగ్గా వింటూ.. వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందనే భరోసా కల్పిస్తూ ముందుకు కదిలారు సీఎల్‌పీ నేత మల్లుభట్టి విక్రమార్క. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ కొనసాగింపుగా జిల్లా మీదుగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రెండో రోజు కొనసాగింది. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని గ్రామాల మీదుగా 17 కిలోమీటర్ల మేర సాగింది. బజార్‌హత్నూర్ మండలం పిప్రి వద్ద గురువారం యాత్ర ప్రారంభమైన విషయం తెలిసిందే. రాత్రి ఇచ్చోడలో బస చేశారు. శుక్రవారం ఉదయం 10గంటలకు యాత్ర షురూ చేశారు. దుబార్‌పేట్, పట్వారిగూడ, మాధాపూర్, పొన్న, రాయిగూడ, సుంకిడి, జాకిర్‌గూడ మీదుగా సిరికొండకు సాయంత్రం చేరుకుంది.

శ్రేణుల్లో ఉత్సాహం..

పాదయాత్రలో భట్టి వెంట కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా నడిచారు. ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నప్పుడు మిగతా నేతలు కూడా ఆసక్తిగా వినడం కనిపించింది.

నేడు ఖానాపూర్ నియోజకవర్గంలోకి ప్రవేశం

బోథ్ నియోజకవర్గంలో రెండు రోజుల పాటు సాగిన పాదయాత్ర శనివారం ఖానాపూర్ నియోజకవర్గానికి చేరుకోనుంది. శుక్రవారం రాత్రి సిరికొండలో బస చేసిన భట్టి శనివారం ఉదయం 7గంటల నుంచే పాదయాత్ర మొదలుపెట్టనున్నారు. దస్నాపూర్ మీదుగా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లికి చేరుకుంటారు. పాదయాత్ర అనంతరం రాత్రి కార్నర్ సమావేశంలో పాల్గొంటారు. ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

సమస్యలను ఆలకించారు..

మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన పాదయాత్ర సాగుతుంది. జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, బోథ్ నియోజకవర్గ నేతలు వెన్నెల అశోక్, ఆడె గజేందర్, ఇతర నేతలు వెంట నడిచారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. ఇచ్చోడ బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన చెప్పులు కుడుతున్న వ్యక్తిని భట్టి పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆటోడ్రైవర్ షేక్ జావిద్, కూరగాయలు విక్రయించే షేక్ మోయిజ్‌లు భట్టితో సమస్యలపై ఏకరువు పెట్టారు. దుబార్‌పేట్‌లో ప్రజలు స్వాగతం పలికి తమ గోడు వినిపించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలతో గ్రామం మునిగిందని, పునరావాస చర్యలు ఇప్పటివరకు సరిగ్గా అందలేదని తెలిపారు. గ్యాస్ ధర పెరిగి కొనలేని పరిస్థితిలో కట్టెలు తెచ్చుకుందామని అడవికి పోతే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, తామెల్ల బతికేదని దేశ్‌ముఖ్ సుగుణబాయి భట్టితో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా పూర్తి ప్రయత్నం చేస్తానని సీఎల్‌పీ నేత వివరించారు. పట్వారిగూడలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బడిని అభివృద్ధి చేసే విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మాదాపూర్ గ్రామంలో పేదలు తాము నివసిస్తున్న ఇళ్లను భట్టికి చూయించారు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇలాంటి పేద వారి కోసం ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని భరోసానిచ్చారు. ఆ సందర్భంలో గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

జిల్లా సమస్యలపై ప్రస్తావన

సిరికొండలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లా సమస్యలపై ప్రస్తావించారు. సాగునీరు ఇవ్వని ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే తాను పాదయాత్ర చేస్తున్నానన్నారు. సిరికొండలో షాదీ ఖానా నిర్మాణానికి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో రాత్రి జరిగిన పాదయాత్రలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు.

శివాలయానికి వెండిదార పాత్ర



వెండిదార పాత్రను అందజేస్తున్న దాతలు

రెబ్బెన: మండలంలోని నంబాలలో గల ప్రసన్న పరమేశ్వరాలయానికి నారాయణపూర్‌కు చెందిన భక్తులు శుక్రవారం వచ్చారు. శివలింగానికి అభిషేకం నిర్వహించేందుకు 1.75 కిలోల వెండిదార, పాత్రను విరాళంగా అందజేశారు. నారాయణపూర్‌కు చెందిన తనుకు జగదీశ్ మీన, తనుకు మురళీ ప్రతిభ, బోనగిరి రమేశ్, సాయిప్రసన్న, బోనగిరి భీమేశ్ ఉపారాణి, బోనగిరి నారాయణ పుష్పలత దంపతులు 1.75 కిలోల వెండితో తయారు చేయించిన అభిషేకం దార పాత్రను ఆలయ కమిటీ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఆలయ కమిటీ సభ్యులకు అందజేయగా ఆలయంలో అమర్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తనుకు తిరుపతి, బోనగిరి నారాయణ, అశోక్, ప్రకాశ్, మహాసభల జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు రాజన్న, కూషన్న, గురువయ్య పాల్గొన్నారు.